క్లుప్తంగా

నిరుద్యోగ జంగ్‌సైరన్ సభను విజయవంతం చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈనెల 8వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరుద్యోగ జంగ్‌సైరన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలోని అన్నివర్గాలకు ప్రజలకు నిరాశే మిగిలిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై, పేపర్ లీకులకు నిరసనగా నిరుద్యోగ జంగ్ సైరన్ సభను సరూర్ నగర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ప్రియాంకగాంధీ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాల్లోని వివిధ రకాల పంటలను ఉద్యానవన, వ్యవసాయశాఖల అధికారులు శనివారం పరిశీలించారు. ఉద్యానవనశాఖ అధికారి శైలజ, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ ఆయా గ్రామాల్లోని వరి, ఇతర కూరగాయ పంటలను పరిశీలించారు. వర్షం పడుతున్న సమయంలో పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను సర్వే చేయించి నష్టపరిహారం చెల్లించాలని టీజేఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆశప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులు, టీజేఎస్ నాయకులు కలిసి శనివారం ఆర్డీఓ రమేష్‌బాబు, వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశప్ప మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అరుగాలం కష్టపడి పంటల సాగుకోసం లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి పంటలు పండించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టీజేఎస్ ఝరాసంగం, కోహీర్ మండలాల అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, అలీమ్, రైతులు రాజారెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, సందీప్, వీరారెడ్డి, ఆరిఫ్ ఉన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

సదాశివపేట(సంగారెడ్డి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నూతన ఓటరు నమోదుకు మార్పులు చేర్పులకు అన్ని రాజకీయపార్టీల నాయకులు అధికారులకు సహకరించాలని తహశీల్దార్ మనోహర్ చక్రవర్తి కోరారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్‌గా ఓట్లు నమోదు అయినా.. మరణించినా.. వలస వెళ్లినా.. వారి ఓట్ల గుర్తింపును తొలగించేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ వీరేశం, ఆర్ఐ గణేష్, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, సిద్దన్న, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు చీలమల్లన్న, అంజనేయులు, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు శ్రీనివాస్, అంబదాస్, ఎంఐఎం పట్టణ అధ్యక్షులు గౌస్‌పాష పాల్గొన్నారు.

పటాన్‌చెరు: ఈ నెల 7వ తేదీన పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పరమేశం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి పటాన్‌చెరులోని వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, రాజకీయ పార్టీలు నాయకులు సకాలంలో హాజరై ఓటరు జాబితా శుద్ధికరణకు సహకరించాలని ఈ సందర్భంగా తహసీల్దార్ కోరారు.

ఈసారైనా ఇబ్బందులు తొలగేనా?

- నాసిరకంగా స్కూల్ యూనిఫాం
- ఊడుతున్న కుట్లు, గుండీలు
- అధికారులు దృష్టిసారించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



సివిల్ డ్రెస్‌లో లాలాకుంట పాఠశాల విద్యార్థులు (ఫైల్)

కోహీర్(జహీరాబాద్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విద్యార్థుల యూనిఫాంకు ఏటా రూ.వందల కోట్లు ఖర్చు చేస్తోంది. అధికారుల బాధ్యతారాహిత్యం, ఏజన్సీల నిర్లక్ష్యంతో పథకం నిరుపయోగమవుతోంది. పంపిణీ చేసిన కొన్నాళ్లకే యూనిఫాం పాడవుతోంది. దీంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరక పోగా కోట్లాది ప్రజాధనం వృథా అవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా ఇబ్బందులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- కోహీర్ మండలంలో 33 ప్రభుత్వ ప్రాథమిక, ఎనిమిది ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలో చదువుతున్న 4,200 మంది విద్యార్థినీ విద్యార్థులకు విద్యా సంవత్సరంలో రెండు జతల యూనిఫాం పంపిణీ చేస్తున్నారు.
- యూనిఫాం కుట్టే బాధ్యతను టెండరు ద్వారా ప్రైవేట్ ఏజన్సీలకు అప్పచెప్పే బాధ్యతను మండల విద్యాధికారులకు అప్పగించారు.
- విద్యాధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి టెండరు ప్రక్రియను ఖరారు చేస్తారు. యూనిఫాం కుట్టే కాంట్రాక్టును దక్కించుకున్న ఏజెన్సీ వారు ఉన్నత విద్యా మండలి గైడ్‌లైన్స్ ప్రకారం యూనిఫాం కుట్టాలి.
- అయితే అధికారుల బాధ్యతారాహిత్యం, ఏజన్సీల నిర్లక్షంతో యూనిఫాంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ధరించిన కొన్నాళ్లకే కుట్లు ఊడిపోతున్నాయి.
- దీంతో విద్యార్థుల యూనిఫాం కుట్టడానికి సరఫరా చేసిన బట్ట క్వాలిటీపై కొందరు ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. యూనిఫాం కుట్టడానికి విద్యార్థుల కొలతలు తీసుకోవడంలో ఏజన్సీలు నిర్లక్ష్యం చేస్తున్నాయి.
- ఆయా తరగతుల విద్యార్థుల సాధారణ ఎత్తును బట్టి యూనిఫాం తయారు చేస్తున్నారు.
- ఏజెన్సీలు కుట్టిన దుస్తువులు కొందరికి పొట్టిగా, మరికొందరికి పొడుగవుతున్నాయి.
- యూనిఫాం కుట్టడానికి వాడిన దారం నాసిరకంగా వాడటంతో కుట్లు ఊడిపోయి దుస్తులు నిరుపయోగమవుతున్నాయి.
- చొక్కాలకు గుండీలు సక్రమంగా కుట్టకపోవడంతో కొన్నాళ్లకే ఊడిపోతున్నాయి. నాసిరకం జిప్పులు వాడడంతో ఫెయిలై విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.
- జిప్పులు ఫెయిలవడంతో కాంటాలు, పిన్నులు పెట్టుకోవలసి వస్తుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వ ఆశయాన్ని సక్రమంగా నెరవేర్చడానికి వీలుగా యూనిఫాం తయారీలో శ్రద్ధ తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

పొట్టిగా ఉంది



నేను కోహీర్‌లోని లాలాకుంట ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాను. నాకు గత ఏడాది రెండు జతల యూనిఫామ్ ఇచ్చారు. ఇచ్చిన దుస్తువులు పొట్టిగా ఉండటంతో ఇంటివద్ద ఉన్నపుడు వేసుకుంటున్నా. మా అన్నకు ఇచ్చిన యూనిఫామ్ కురుచ అవడంతో నాకు ఇచ్చాడు. మా అన్నకు యూనిఫామ్ లేకుండా పోయింది. డ్రెస్ కుట్లు పోయాయి.

– గణేష్, లాలాకుంట పాఠశాల

ఫిర్యాదు చేశాం



నాసిరకం దారం, జిప్పుల వాడడకంతో యూనిఫామ్ నిరుపయోగమవుతోంది. ఇదే విషయాన్ని ప్రధానోపాధ్యాయుల సమావేశంలో విద్యాధికారికి స్పష్టంగా చెప్పాం. గత విద్యా సంవత్సరం కుట్టిన ఏజెన్సీపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. కొలతలు తీసుకొని యూనిఫామ్ కుట్టిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– రామోజీరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, లాలాకుంట

గైడ్‌లైన్స్ ప్రకారమే..



గత ఏడాది అనుభవం దృష్ట్యా ఈ సంవత్సరం యూనిఫామ్ తయారీలో శ్రద్ధ తీసుకుంటున్నాం. కొత్త ఏజెన్సీకి యూనిఫామ్ కుట్టే బాధ్యతలను అప్పగించాము. ఉన్నత విద్యామండలి గైడ్‌లైన్స్ ప్రకారం కుట్టాలని ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేశాం. వచ్చే ఏడాది త్వరగా పంపిణీ చేస్తాం.

– శంకర్, మండల విద్యాధికారి కోహీర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్, కౌన్సిలర్లు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని దుర్గభవాని మందిరం నుంచి అయ్యప్ప మందిరం వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో పట్టణ మహిళా సమాఖ్య సభ్యులు ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ధైర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గొల్లపల్లి, మల్కాపూర్‌లో .ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. పీఏసీఎస్ చైర్మన్‌లు శ్రీకాంత్ రెడ్డి, పవన్‌కుమార్, ఎంపీటీసీలు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరప్పస్వామి జాతర



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని బసంత్‌పూర్ గ్రామంలో కుర్మ, యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్పస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం బోనాల ఊరేగింపు నిర్వహించి స్వామివారికి సమర్పించారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులతో నరేందర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలలో సమ్మర్ సమురాయ్‌లో భాగంగా పదిరోజులుగా నిర్వహించిన క్రికెట్, బాస్కెట్‌బాల్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్ మధు సూదన్‌రెడ్డి, పరిశీలకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నారాయణఖేడ్ అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, జన సురక్ష సంతృప్తత, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ డీసీసీబీ మేనేజర్ కలీమొద్దీన్, ఫీల్డ్ ఆఫీసర్ నాగేందర్ పాటిల్, సురేష్‌కుమార్ సూచించారు. నిజాంపేట్ మండలంలోని మెగ్యానాయక్ తండాలో శనివారం కేంద్ర ప్రభుత్వం పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుకారాం, ఐకేపీ సీసీలు, తండావాసులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి హోమం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, తీర్థ ప్రసాద గోష్ఠి, పండిత సత్కారం తదితర పూజలను నిర్వహించారు.

బీజేపీని బలోపేతం చేయాలి

జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుధీర్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతకుముందు సుధీర్ కుమార్‌ను నాయకులు, కార్యకర్తలు పూలమాలతో సన్మానించారు

ఆర్టీసీతో మెరుగైన సేవలు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఆర్టీసీతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లో శనివారం మనూరు మండలం బోరంచ మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరంచలో నిర్వహిస్తున్న నల్ల పోచమ్మ ఉత్సవాలకు రాకపోకలు సాగించే భక్తులకు బస్సు సర్వీస్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. డీఎం మల్లేశయ్య, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండు, సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



జోగిపేట: సమ్మె నిర్వహిస్తున్న వీఓఏలు

జోగిపేట(అందోల్): సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏల సమ్మెకు బీఎస్పీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్షుడు మల్లన్న, వీఓఏలు ఆంజనేయులు, విజయ, సునీత, సువర్ణ, లక్ష్మి, కవిత, వీరమణి, అశోక్, చంద్రిక, హర్ష, వాసవి, బాలయ్య, పోచయ్య, సుప్రియ, అఫ్సర్, గోపాల్, రేణుక, మానస, భాగయ్య, ఫహీం, లాయక్, స్వప్న పాల్గొన్నారు.

ఝరాసంగంలో..

ఝరాసంగం(జహీరాబాద్): సమస్యలు పరిష్కరించాలని ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఐకేపీ వీఓఏలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారం 20వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో వీఓఏలు నాగేందర్, నాగరాణి, శరణప్ప, షబ్బీర్‌మియా, మల్లేష్, ఇంద్రసేనారెడ్డి, నర్సింహారెడ్డి, మారుతి పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్ టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా వీఓఏల సంఘం యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమపై ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మెలో యూనియన్ నాయకులు మంజుల, అశోక్, అన్నపూర్ణ, మజీద్, లక్ష్మీ, అనుసూజ పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

కొండాపూర్(సంగారెడ్డి): ఐకేపీ వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని శనివారం కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాంచందర్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీఓఏలు 20 రోజులుగా సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వీఓఏలు సమ్మె చేస్తుంటే ఏపీఎం సీసీలు పుస్తకాలు ఇవ్వాలని, వీఓఏలను ఇబ్బందులకు గురిచేస్తుండటం సరికాదన్నారు. ఈ పద్ధతిని మానుకోవాలని, లేనిపక్షంలో డ్వాక్రా భవనం ఎదుట అధికారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఎస్ఎం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, వీఓఏలు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి

నారాయణఖేడ్: జేపీఎస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్యం డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మెకు శనివారం సంఘీభావం ప్రకటించారు. సీపీఎం నాయకులు చిరంజీవి, కొటారి నర్సింహులు పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు.

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న జేపీఎస్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాయిలు, నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

ప్లకార్డుతో చిన్నారి నిరసన

జహీరాబాద్ టౌన్: జూనియర్ పంచాయతి కార్యదర్శులు చేపట్టిన సమ్మె శిబిరం వద్ద ఓ చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఓ పంచాయతీ కార్యదర్శి కూతురు తల్లితో పాటు సమ్మె శిబిరానికి వచ్చింది. ఉద్యోగం ఇచ్చినది మీరే.. ఉద్యోగ భద్రత కల్పించాల్సింది మీరే కేసీఆర్ సార్.. అనే నినాదంతో రాసిన ప్లకార్డును పట్టుకుని నిల్చుంది. పాపను అందరూ ఆసక్తిగా చూశారు. సమ్మెలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిత్య, జిల్లా కార్యదర్శి నిషా పాటిల్, వివిధ మండలాల వీఓఏలు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: మాట్లాడుతున్న మాణిక్యం



ప్లకార్డుతో చిన్నారి

పంటల సాగుతో అదనపు ఆదాయం

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో నీటి వసతి ఉన్న రైతులు ఇతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి సూచించారు. శనివారం ఝరాసంగంలో రైతు సంగమేశ్వర్ సాగు చేస్తున్న వేసవి నువ్వు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనె గింజల సాగులో నువ్వుల సాగు ప్రధానమన్నారు. ఈ పంటలను ముందస్తు వానాకాలం (మే), లేట్ ఖరీఫ్(ఆగస్టు) నెలలో సాగు చేసుకోవచ్చన్నారు. పంటల మార్పులో భాగంగా వానాకాలం పత్తి అనంతరం నీటి వసతి ఉన్న రైతులు జొన్న, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఏఈఓ సుకుమార్, ఆత్మ బీటీయం చరణ్ పాల్గొన్నారు.

డీఎంఎఫ్ నిధులను గ్రామాభివృద్ధికి కేటాయించాలి



మాట్లాడుతున్న భార్గవ్

జిన్నారం(పటాన్‌చెరు): క్రషర్‌ల ద్వారా వచ్చే డీఎంఎఫ్ నిధులను గ్రామ అభివృద్ధికి కేటాయించాలని ఖాజీపల్లి ఎంపీటీసీ భార్గవ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖాజపల్లి, మాదారం గ్రామాల పరిధిలో అధికసంఖ్యలో కంకర క్రషర్‌లు ఉన్నాయన్నారు. కంకర క్రషర్‌ల ద్వారా వచ్చే డీఎంఎఫ్ నిధులు గ్రామాభివృద్ధికి కేటాయించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

కొనసాగుతున్న పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని కోడూరులో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా శనివారం చండీ రుద్రహోనం, ప్రతిష్ఠాంగ దేవతా మూలమంత్ర హోరణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శనగ కొనుగోళ్లు పూర్తి

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరము రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో శనగల కొనుగోలు పూర్తి అయింది. క్వింటాలు శనగల మద్దతు ధర రూ.5,335 నిర్ణయించి రైతుల నుంచి 7,404 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేశారు. త్వరలో సన్ ఫ్లవర్, మొక్కజొన్న, జొన్నల కొనుగోలును కొనసాగిస్తామని ఆ సంఘం సీఈఓ నీలయ్య పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ బొంబాయికాలనీలో ఓ నిరుపేద కుటుంబంలో జరుగుతున్న శుభకార్యానికి బీఆర్ఎస్ నాయకులు, ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖదిర్ శనివారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ నిరుపేదలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధే లక్ష్యమని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో రూ.50లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడతెరిపిలేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు కాలనీలోకి వరద వస్తుండటంతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బబురుగడ్డ నగేష్, విఠల్, సత్యనారాయణ, సింగ్, బలరాం పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారంతో గ్రామ అభివృద్ధి

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఖాజీపల్లి సర్పంచ్ చిట్ల సత్యనారాయణ తెలిపారు. శనివారం ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.2.30కోట్లతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు పరిశ్రమల ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఇందుకు సంబంధించిన నిధులు త్వరలోనే విడుదలవుతాయన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చొరవతో పరిశ్రమల యాజమన్యాల సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.

సరిహద్దులో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ–కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దులోని మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ బాడర్‌లో శనివారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి–మాడ్గి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. జహీరాబాద్ ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో వేంకటచల దివ్యక్షేత్రంలో నిర్వహించనున్న పద్మావతి గోదసమేత వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. భక్తులు ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గురు దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

కోహీర్(జహీరాబాద్): మండలంలోని పర్సపల్లి గ్రామంలో గురు దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు గోపూజ, హోమం, సాయంత్రం 6 గంటలకు జెండా ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉదయ్‌కిరణ్ అవధాని(శ్రీశైలం దేవస్థానం)వారి ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర పూజ, పూర్ణాహుతి, సర్వదర్శనం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పరిహారం చెక్కు పంపిణీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: నారాయణఖేడ్ మండలం చాప్ట కె అకాలయితండాకు చెందిన చెరుకు రైతు జాదవ్ దేవిసింగ్ ఎద్దు ఇటీవల చనిపోవడంతో శనివారం సంగారెడ్డి చెరుకు అభివృద్ధి మండలి కార్యాలయంలో సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, రూ.15వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్, ఏసీసీ రాజశేఖర్, సీఆర్ఐ రమణి, గణపతి షుగర్ ఫ్యాక్టరీ జీఎం కృష్ణమోహన్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కార్పొరేటర్ వెన్నవరం సింధు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అదర్శ్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా(కె)కు చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.50వేల చెక్కును టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి శనివారం ఖేడ్‌లోని తన నివాసంలో సదరు వ్యక్తి కుటుంబీకులకు అందజేశారు. డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సంగారెడ్డి, వెంకట్‌నాయక్, నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు అవుటి శంకర్ పాల్గొన్నారు.

మైనార్టీ కమిషన్ సభ్యుడిగా తన్వీర్

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడిగా మాజీ మంత్రి దివంగత ఫరిదొద్దీన్ కుమారుడు తన్వీర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు తన్వీర్‌కు శుభాకాంక్షలు తెలిపి సీట్ తినిపించారు. కార్యక్రమంలో జహీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.